## క్లుప్తంగా

### పింఛన్‌దారులందరూ ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాలి



మాట్లాడుతున్న ధర్మారావు

నరసన్నపేట: పింఛన్‌దారులందరూ ఆధార్‌ను అప్‌డేట్ చేయించుకోవాలని పొందూరు, ఆమదాలవలస మండలాల విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఎ.ధర్మారావు, ఎస్.ప్రభాకరరావు అన్నారు. స్థానిక కోవెల వీధిలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో పింఛన్‌దారుల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 24న జిల్లాకు రాష్ట్ర పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు కె.అల్‌ఫ్రెడ్ వస్తున్నట్టు చెప్పారు. ఆయన పర్యటనను విజయవంతం చేయాలన్నారు. ఆధార్ అప్‌డేట్, ఫారమ్–16కు సంబంధించి విశ్రాంత ఉద్యోగులకు వివరించారు. కార్యక్రమంలో నరసన్నపేట, పోలాకి మండలాలకు చెందిన పింఛన్‌దారులు పాల్గొన్నారు.

### ఆరోగ్యమే మహాభాగ్యం



కార్యక్రమంలో వైద్య సిబ్బంది

జలుమూరు: ఆరోగ్యమే మహాభాగ్యమని జలుమూరు పీహెచ్‌సీ వైద్యాధికారి చల్ల వంశీకృష్ణ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. పరిసరాలు పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమన్నారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు చిన్న రాజులు, సిబ్బంది ఉన్నారు.

### విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ



విద్యార్థులకు సామగ్రి అందజేస్తున్న సర్పంచ్ రత్నాలు తదితరులు

కొత్తూరు: కొత్తూరులోని ఎస్సీ బాలుర వసతి గృహం విద్యార్థులకు పారాపురం సర్పంచ్ కుంచాల రత్నాలు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు రాంబాబులు అండగా నిలిచారు. ఇటీవల కురిసిన వర్షాలకు వసతి గృహంలోకి వర్షం నీటితో పాటు మురుగునీరు చొచ్చుకుపోయింది. దీంతో విద్యార్థులకు చెందిన దుస్తులతో పాటు పుస్తకాలు తడిసిపోయి పాడయ్యాయి. విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు నాయకుల దృష్టికి రావడంతో దుప్పట్లు, డ్రెస్సులు, జగ్గులు, సబ్బులు, పెన్నులు, పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో పారాపురం, ఎల్ఎన్‌పేట వార్డెన్లు ఉమాశంకరరావు, కుంచాల జోగినాయుడు, సచివాలయం కన్వీనర్లు బసవ ప్రసాద్, విమలకుమారి, అరుణకుమారి, కె.రవి పాల్గొన్నారు.

### వైఎస్సార్‌సీపీ బలోపేతానికి దోహదం



కిట్లు అందజేస్తున్న దృశ్యం

జలుమూరు: 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం ద్వారా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతోందని ఎంపీపీ వాన గోపి అన్నారు. పాగోడు సచివాలయంలో జగనన్నే మా భవిష్యత్తు... మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంపై గృహసారథులు, వలంటీర్లతో శుక్రవారం సమీక్షించారు. కార్యక్రమానికి చెందిన కిట్లను అందజేశారు. వైస్ ఎంపీపీ తంగి మురళీకృష్ణ, సచివాలయ కన్వీనర్ ధర్మాన జగన్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు దామ మన్మథరావు, ఎంపీటీసీ సభ్యుడు రావాడ చందనబాబు, సర్పంచ్‌లు జుత్తు నేతాజీ, బొమ్మాళి ప్రసాద్ పాల్గొన్నారు.

### 'జగనన్నే మా భవిష్యత్తు' షెడ్యూల్ ఇలా..

సరుబుజ్జిలి: 'జగనన్నే మా భవిష్యత్తు షెడ్యూల్'ను మండల సచివాలయాల కోఆర్డినేటర్ అత్తులూరి రవికాంత్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. 8న మతలబుపేట, సరుబుజ్జిలి, 10న విజయరాంపురం, చినకాగితాపల్లి, 11న చిగురువలస, తెలికిపెంట, 12న షళంత్రి, కొత్తకోట, 13న ఇస్కలపాలెం, సింధువాడ, 14న రొట్టవలస, కొండవలస, 15న పాలవలస, పురుషోత్తపురం సచివాలయాల్లో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమంపై ప్రజలను కలిసి వివరిస్తామన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆమదాలవలస: ఆమదాలవలస 33/11కేవీ ఇండోర్ సబ్‌స్టేషన్ పరిధిలోని బి.ఆర్.నగర్, వెంగళరావు కాలనీ ఫీడర్ల పరిధిలో రోడ్ క్రాసింగ్ దగ్గర కొత్త స్తంభాలను వేస్తున్నందున శనివారం విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్టు ఈఈ ఎస్.భయ్యాన్నాయుడు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు కృషివిజ్ఞానకేంద్రం, ఎంపీడీవో కార్యాలయం, గేటు తదితర ప్రాంతాలకు సరఫరా ఉండదని.. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.



పాతపట్నం: గంగువాడలో ఇంటికి స్టిక్కర్ అతికిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



నరసన్నపేట: మఠంవీధిలో సర్వే అనంతరం స్టిక్కర్‌ను ఇంటి యజమానికి అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



మెళియాపుట్టి: జాడుపల్లి గ్రామంలో సంక్షేమాన్ని వివరిస్తున్న తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్

# ప్రజల చెంతకే.. సంక్షేమ పాలన

- 'జగనన్నే మా భవిష్యత్తు' ప్రారంభంలో స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: జవాబుదారీతనంతో ప్రజల్లోకి వెళ్లే ధైర్యం వైఎస్సార్ కాంగ్రెస్ సర్కార్‌కే ఉందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. 'జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని ఆమదాలవలసలోని క్యాంపు కార్యాలయం వద్ద శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 20వ తేదీ వరకు జరగనున్న ఈ కార్యక్రమాన్ని ఆమదాలవలస నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో పండుగ వాతావరణంలో నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు సూచించారు. ఈ బృహత్తర కార్యక్రమం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా నేరుగా 1.60 కోట్ల కుటుంబాలను కలిసే అవకాశం ఉందన్నారు. ఇందులో భాగంగా పార్టీ నియమించిన కన్వీనర్లు, గృహసారథులు బాధ్యతగా, క్రమశిక్షణ కలిగిన సైనికుల్లా పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన నాలుగేళ్లలో ప్రతి గడపకు వెళ్లగలుగుతున్నామంటే దానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న పథకాలే కారణమన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను మేనిఫెస్టోలో పొందుపరిచి దాన్ని పవిత్ర గ్రంథంగా భావించి 98 శాతం అమలపరిచిన ధీరుడు సీఎం జగన్ అని కొనియాడారు. ప్రతినెల ఒకటో తేదీన పింఛన్ అందించేందుకు వలంటీర్ వెళ్లినట్టే ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా ప్రతి నెలలో రెండుసార్లు వైద్యుడు వారి గడప వద్ద వైద్యాన్ని అందిస్తారని పేర్కొన్నారు. ప్రతిపక్షాలు వికృతి చేష్టలతో ముఖ్యమంత్రి చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అడ్డుకుంటున్న తీరును ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలని సూచించారు. నాలుగేళ్లుగా చేపట్టిన ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై ప్రజల మనసులో దాగి ఉన్న దృక్పథాన్ని తెలుసుకోవాలన్నారు. పార్టీ అందజేసిన ప్రచార సామగ్రిని జేసీఎస్ కన్వీనర్, పార్టీ ముఖ్య క్యాడర్‌తో కలిసి పంపిణీ చేయాలన్నారు. సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు, స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి సచివాలయాల పరిధిలో ఇంటింటికీ వెళ్లి జగనన్నే మా భవిష్యత్తు ప్రచార కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటి వద్ద సుమారు 15 నుంచి 20 నిమిషాలు గడపాలన్నారు. ప్రచార సందేశాన్ని వివరించి వారి మద్దతు కోరాలన్నారు. గత ప్రభుత్వం కంటే వైఎస్సార్ ప్రభుత్వ పాలనలో ప్రజలకు మరింత మంచి జరుగుతుంది అనే కరపత్రాన్ని చదివి, దానిని ఇంటి వారికి అందజేయాలన్నారు. ప్రజా మద్దతు పుస్తకాలలో ఉన్న ప్రశ్నలను ఇంటి వారిని అడిగి సమాధానాలను పూరించి ఆ ఇంట్లో వారికి రశీదు ఇవ్వాలన్నారు. ముఖ్యంగా ఇంటి యజమాని అనుమతితో ఇంటి డోర్, మొబైల్ ఫోన్లకు స్టిక్కర్లను అతికించాలన్నారు. జగనన్న పాలనకు మద్దతు తెలిపేందుకు 82960 82960 నంబరుకు మిస్డ్ కాల్ ఇవ్వాలని ఇంటి యజమానిని అభ్యర్థించాలన్నారు. ఈ సందర్భంగా జగనన్నే మా భవిష్యత్తు పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం 17వ వార్డు పూజారిపేటలో కార్యక్రమాన్ని ప్రారంభించి గడప గడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించి ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్‌కుమార్, సాహిత్య అకాడమి డైరెక్టర్ జె.జె.మోహన్‌రావు, ఆమదాలవలస, పొందూరు జెడ్పీటీసీ సభ్యులు బెండి గోవిందరావు, లోలుగు కాంతారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు జి.శ్రీనివాసరావు, సచివాలయాల కన్వీనర్లు ఎ.ఉమామహేశ్వరరావు, బి.నిరంజన్, నాయకులు కె.వి.జి.సత్యనారాయణ, కొంచాడ రమణమూర్తి, తమ్మినేని శ్రీరామమూర్తి, జె.కె.వెంకటేశ్వరావు పాల్గొన్నారు.



బూర్జ: లక్కుపురంలో సంక్షేమాన్ని వివరిస్తున్న ఎంపీపీ కర్నేన దీప



ఎల్.ఎన్.పేట: చిన్నకొల్లివలస పునరావాస కాలనీలో కార్యక్రమం నిర్వహిస్తున్న ఎంపీపీ జ్యోతిలక్ష్మి, రెడ్డి రామారావు



కొత్తూరు: బలద గ్రామంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు



సారవకోట: బుడితి గ్రామంలో కార్యక్రమం నిర్వహిస్తున్న పార్టీ నాయకులు



ఆమదాలవలస: పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం తదితరులు

### మా నమ్మకం నువ్వే జగన్ అంటున్న ప్రజలు

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: సంక్షేమ పథకాలను అర్హతే ప్రామాణికంగా అమలు చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే మరోసారి ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని నరసన్నపేట ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. నరసన్నపేట మేజరు పంచాయతీ మఠంవీధిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ప్రారంభించారు. వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు వెంట రాగా 21 ఇళ్లకు వెళ్లి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ఆరా తీశారు. ఐదు ప్రశ్నలను సంధించి ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. అంతకుముందు నరసన్నపేట పంచాయతీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. జగనన్నే మా భవిష్యత్తు అని ప్రజలు అంటున్నారన్నారు. ఈ కార్యక్రమాన్ని శ్రీకాకుళం జిల్లాలో పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. పార్టీ నియమించిన గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు బాధ్యతగా పాల్గొవాలన్నారు. ఇంటి యజమానుల అనుమతితో గోడపై స్టిక్కర్ అంటించాలని కోరారు. నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో శ్రీశైన, పొందర కార్పొరేషన్ల చైర్మన్లు చీపురు రాణి, రాజాపు హైమావతి, డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, ఎంపీటీసీ సభ్యుడు వైశ్యరాజు కేశవరాజు, నేతింటి రాజేశ్వరరావు, ఉప సర్పంచ్ ఎస్.కృష్ణబాబు, నాయకులు కేసీహెచ్‌బీ గుప్త, రాజాపు అప్పన్న, గనగళ్ల శ్రీను పాల్గొన్నారు.

### జగన్‌ను మళ్లీ సీఎంను చేద్దాం

- ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరోసారి ముఖ్యమంత్రిని చేయాల్సింది మీరేనని ప్రజలకు తెలియజేయాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి సూచించారు. పాతపట్నం, గంగువాడ, కొరసవాడ, సీది తదితర 18 గ్రామ సచివాలయాల పరిధిలో జగనన్నే మా భవిష్యత్...మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులతో కలిసి కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎంపీపీ దొర సావిత్రి, పీఏసీఎస్ అధ్యక్షుడు ఎం.శ్యామ్‌సుందరావు, ఏఎంసీ చైర్మన్ కె.అర్జునుడు, వైస్ ఎంపీపీ ప్రదీప్, మండల కన్వీనర్ వై.సూర్యం, అలయ చైర్మన్ నూలు ఈశ్వరరావు, డైరెక్టర్లు మంచు చంద్రయ్య, వై.వెంకటరమణ, నాయకులు పనుకు మోహన్, కర్రి లక్ష్మీనారాయణ, జి.సూర్యం, ఎం.తాతయ్య, పడాల రంజిత్, పోతల శ్రీనివాసరావు, ఢిల్లేశ్వరావు, ఉమామహేశ్వరరావు, శ్రీధర్, పలు పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

### ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఆమదాలవలస రూరల్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ అన్నారు. రామచంద్రాపురం గ్రామంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరించి.. జగనన్న స్టిక్కర్‌ను ఇంటి గోడకు అతికించారు. మండల ప్రత్యేకాహ్వానితుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి, జెడ్పీటీసీ సభ్యుడు బెండి గోవిందరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ చల్లా ఉష, ఎంపీటీసీ సభ్యుడు కొల్లి యమున, మండల సచివాలయాల కన్వీనర్ బొడ్డేపల్లి నిరంజన్, పార్టీ నాయకులు చల్లా సింహాచలం, రౌతు శ్రీనివాసరావు, మొండేటి కూర్మారావు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.



ఆమదాలవలస రూరల్: సంక్షేమ పథకాలను వివరిస్తున్న చిరంజీవినాగ్



నరసన్నపేట: పోతయ్యవలసలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహిస్తున్న కనపల శేఖర్ తదితరులు



హిరమండలంలో సంక్షేమాన్ని వివరిస్తున్న నాయకులు మీసాల వెంకట రామకృష్ణ, ఏపీ సురేష్‌లు



సరుబుజ్జిలి: రొట్టవలసలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మూడల్ల రమణ

# కష్టసుఖాలు తెలుసుకోవడానికే..



లబ్ధిదారులతో మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: ప్రజా సంక్షేమ సమతుల్యానికే 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రజల కష్టసుఖాలు తెలుసుకుంటున్నామని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. స్థానిక 22వవార్డు లక్ష్మడిపేట గ్రామంలో శుక్రవారం సాయంత్రం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వారు ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధిని వివరించారు. సమస్యలు అడిగితెలుసుకుని సత్వర పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేయాలనే అభిలాషతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలకు టీడీపీ నాయకులు కుట్ర పూరితంగా అడ్డుకుంటున్నారన్నారు. పాలనా వికేంద్రీకరణతో రాష్ట్ర దశ,దిశలను మార్చే బృహత్తర యజ్ఞానికి కృషిచేస్తున్న ప్రయత్నానికి ముఖ్యమంత్రితో అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.రవిసుధాకర్, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్‌కుమార్, సచివాలయాల కో–ఆర్డినేటర్ ఎ.ఉమామహేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ దుంపల చిరంజీవిరావు, నాయకులు దుంపల శ్రీను, బగాది రమణమూర్తి, ఎన్ని గోవిందరావు, సాధు చిరంజీవిరావు, బొడ్డేపల్లి రాజు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజల్లో జవాబుదారీతనం పెంచాం



మహిళలకు బ్రోచర్లను అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

- ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్
- కొమనాపల్లిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

జలుమూరు: ప్రతి గడపకు సంక్షేమ ఫలాలను పారదర్శకంగా అందించి ప్రజల్లో జవాబుదారీతనం పెంచిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. కొమనాపల్లి గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల అమలును వివరించారు. ప్రభుత్వ సేవలను సచివాలయాల ద్వారా మెరుగ్గా అందించి నీతి,నిజాయితీతో కూడిన పాలన అందిస్తున్నామన్నారు. చేకూరిన లబ్ధికి సంబంధించిన బ్రోచర్లను అందజేశారు. గ్రామం మధ్యలో మురుగునీరు నిలిచిపోతుండడంతో అవస్థలు పడుతున్నామని మండల కన్వీనర్ కనుసు సీతారాం, సర్పంచ్ సీతమ్మలు కృష్ణదాస్‌కు వివరించారు. వెంటనే కృష్ణదాస్ కలుగుచేసుకొని సంబంధిత గుత్తేదారుతో ఫోన్‌లో మాట్లాడి రోడ్డు మరామ్మతులు చేపట్టాలని సూచించారు. ఇదే రోడ్డు అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయని వెంటనే పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. అలాగే తాత్కాలికంగా మురుగునీరు పోయేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో రవికుమార్‌ను ఆదేశించారు. పంచాయతీ నిధులు వెచ్చించి సమస్య పరిష్కారం చేయాలన్నారు.

కార్యక్రమంలో ఎంపీపీ వాన గోపి, వైస్ ఎంపీపీ తంగి మురళీకృష్ణ, స్థానిక నాయకులు మెండ కృష్ణ, అల్లాడ సొసైటీ అధ్యక్షుడు ముసలినాయుడు, సచివాలయ కన్వీనర్ ధర్మాన జగన్, మండల సలహాదారు పైడి విఠలరావు, సీనియర్ నాయకులు ఎం.శ్యామలరావు, బుక్కా లక్ష్మణరావు, దామ మన్మథరావు, సర్పంచ్‌లు సతీష్, ధర్మాన రమణమూర్తి, హరిప్రసాద్, దుంగ ప్రసాద్, మూకళ్ల సత్యం పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే



కొత్తూరులో ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

పాతపట్నం: గుడ్‌ఫ్రైడేను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో శుక్రవారం జరుపుకున్నారు. ఏసుక్రీస్తు శిలువ వేసిన రోజుకు గుర్తుగా గుడ్‌ఫ్రైడేను జరుపుకుంటారని పాతపట్నం పాస్టర్లు జి.ప్రసాద్, డి.విజయ్‌కుమార్‌లు అన్నారు. మండల కేంద్రం పాతపట్నంతో పాటు వివిధ గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. పాతపట్నం ఆర్‌సీఎం, జేసీపీ అండ్ ఈఎం, కల్వరీ గోస్పెల్, డబ్ల్యూఈఈ చర్చితో పాటు కొరసవాడలోని ఆంధ్రాబాపిస్టు, తెంబూరు, రొంపివలస, తామర, తీమర, పాశీగంగుపేట, ఆర్.ఎల్.పురం గ్రామాల్లోని చర్చిలో ప్రార్థనలు జరిగాయి.

నరసన్నపేట: ఏసుక్రీస్తు మానవ జాతి రక్షకుడని కల్వరి బాప్టిస్టు చర్చి పాస్టర్ జాన్ డేవిడ్ అన్నారు. గుడ్‌ఫ్రైడే సందర్భంగా నరసన్నపేటలోని పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఏసుక్రీస్తు జననం నుంచి మరణం వరకూ పరిణామాలను వివరించారు. ప్రత్యేక గీతాలు ఆలపించారు. కల్వరి చర్చిలో జరిగిన కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎస్తేరు రాణి, ఎం.శ్రీదేవి, పాస్టర్ రత్నకుమారి పాల్గొన్నారు.



పాతపట్నంలోని జేసీపీఈఎం చర్చిలో ప్రార్థనలు చేస్తున్న దృశ్యం



ఎల్.ఎన్.పేట: ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

కొత్తూరు: కొత్తూరు ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ థామస్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. స్థానిక నాలుగు రోడ్ల కూడలి నుంచి ఆర్‌సీఎం చర్చి వరకు ఏసు ప్రభువు శిలువ వేసిన వేషధారణతో క్రీస్తు విశ్వాసులు ప్రదర్శన నిర్వహించారు.

ఎల్.ఎన్.పేట: శ్యామలాపురం పునరావాస కాలనీలో పాస్టర్ కనక కాంతారావు ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు. ఎల్.ఎన్.పేట మండల కేంద్రం, కోవిలాం కాలనీ, యంబరాం రోడ్డు, బొత్తాడసింగి, సిద్ధాంతం, వాడవలస, పెద్దకొల్లివలస, బసవరాజుపేట రోడ్డు, తురకపేట సెంటర్, రావిచెంద్రి, బాలేరు, సూదిరాయిగూడ, కారిగూడ తదితర గ్రామాల్లోని చర్చిల్లో పాస్టర్లు ఎస్.రాజు, కె.రవికుమార్, టి.వి.రమణ, థామస్ ఆధ్వర్యంలో ప్రార్థనలు జరిగాయి.



నరసన్నపేట: కల్వరి బాప్టిస్టు చర్చిలో గీతాలు ఆలపిస్తున్న దృశ్యం

# ఘనంగా సీతారాముల కల్యాణం



సారవకోట: కల్యాణం జరిపిస్తున్న పురోహితులు



బూర్జ: కల్యాణాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

సారవకోట: గుమ్మపాడు పంచాయతీ అక్కివలస గ్రామంలోని రామాలయంలో సీతారాముల కల్యాణాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో సీతారాముల ఉత్సవ మూర్తులకు పురోహితులు రామానుజాచార్యులు కల్యాణం చేయించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణకర్తలు హనుమంతు సంతోష్, బమ్మిడి నాగరాజు, హనుమంతు తులసీ తదితరులున్నారు.

బూర్జ: చిన్నకురుంపేట గ్రామంలోని రామాలయంలో సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. కల్యాణ పట్టాభిషేకంలో పాల్గొన్న భక్తజనం శ్రీరామనామస్మరణ చేశారు. గ్రామ పురోహితులు, ప్రధాన అర్చకులు అంపోలు కేశవ శర్మ, జగన్నాథ శర్మ నేతృత్వంలో పూజలు జరిగాయి.